# దేవత

స్త్రీ సాన్నిహిత్యం పురుషుని చిత్త వికారానికి నాంది. మహాత్ములకు సహితం తప్పని అవస్థ ఇది. మానవునికి రాక్షసత్వం అయినా, దేవత్వమే అయినా సంప్రాప్తింప చేసేది కూడా ఈలాంటి పొరపాటే.

---

"ధబ్...దబ్..." తలుపుమీద మెల్లగా తట్టాను.

లోపలి హాల్లోని గడియారం కూడ సరిగ్గా అప్పుడే "టంగ్, టంగ్" మని తొమ్మిది గంటలు కొట్టింది.

గడియారం కొట్టే గంటల్ని లెక్కించు



టి. నాదముని రాజు



తడహాయె, రావేల?

చిత్రం—ఎమ్. శంకరరావు (అనకాపల్లి)

కుంటూ తలుపు ముందలాగే నిలుచున్నాను.

నేను తలుపుమీద చేసిన శబ్దం గడియారం గంటల్లో లీనమయింది కాబోలు, ఎవరూ జవాబియ్యలేదు. గదిలో దీపాలు వెలుగుతున్నట్టు తలుపు కంతల్లోనుంచి స్పష్టంగా కనుపిస్తూనే ఉంది.

జేబులోని అడ్రసు కాగితాన్ని మరోమాటు చూచుకుని, "ప రి పూ ర్ణ రా వు గా రూ !", "పరిపూర్ణరావుగారూ!" అని పిలుస్తూ తిరిగి తలుపుమీద శబ్దం చేశాను.

లోపల అలికిడయినట్లుంది. మెల్లని అడుగుల సవ్వడి, కరకంకణముల హృద్యారావంతో పాటే తలుపు తెరచుకుంది. నిల్చున్నపాటే నేను నిశ్చేష్టితుడయ్యాను. తటిల్లత కళ్ళ కెదురుగుండా తటిల్లున మెరసినట్టయింది. మాటల్లో పొదిగేందుకు వీలుకాని సౌందర్యం! క్రిందటేడు చూచిన అజంతా విగ్రహాలు స్ఫురణకొచ్చాయి. ఆనాడా విగ్రహాలు చూచి శిల్పులు కలలకు కల్పన చేశారని భావించాను. యథార్థ ప్రపంచంలో ఏనాడైనా ఈలాంటి అపురూప సుందరాంగులు ఉంటారా అని సందేహపడ్డాను! కాని అలనాటి నా ఊహ నే డీమెను చూస్తూనే శుద్ధ పొరపాటని తేలిపోయింది. వయసు పాతికేళ్ళలోపు, పరిపూర్ణంగా వికాసం పొందిన యవ్వనం, ఆ శరీరపు టొంపులు—ఆ వయ్యారము—ఆ హుందాతనం—అబ్బ! అనుకున్నాను మనసులోనే. ఇదంతా రెండు క్షణికాల కాలంలో మాత్రమే!

"ఎవరండి? రండి!" ప్రశ్న, ఆహ్వానము రెండూ ఒకేసారి! 'ఎంత సంస్కారంగల వ్యక్తి' అనుకున్నాను. రూపంలానే కంఠస్వరం కూడ. మీటిన వీణ తీవలా, వసంతకాలపు కోకిలమ్మ మధుర స్వరంలా ఉంది.

ప్రథమ దర్శనంలోనే నే నామె నాలా పరిశీలనగా పరకాయించి చూడటం, నా మనసులో ఉద్భవించిన విభ్రాంతి ముఖంలోకి ప్రాకి మోహంలో రంగులు మారడం, ఆమె గమనిస్తే నన్నేమని భావిస్తుంది? సంస్కార రహితుడుగా తొలి వీక్షణంలోనే ఆమె భావిస్తే... ఎంతో సిగ్గు పడ్డాను. నా శరీరం కుంచించుకుపోతూందా అనేలా బాధపడ్డాను.

గదిలోకి అడుగువేయకుండానే బుద్ధిమంతుడైన కుర్రాడిలా "పరిపూర్ణరావుగారు లేరాండీ" అని ప్రశ్నించాను.

"లేరు. సాయంకాలం బండికి విజయవాడ కెళ్ళారు. మీరు....."అర్ధోక్తిలోనే ఆగిం దామె.

"నన్ను రాజారావంటారు. పరిపూర్ణ..." నన్ను నేనే పరిచయం చేసుకోవలసి వచ్చినందుకు మరింత సిగ్గుపడ్డాను.

ఆమె విశాల నయనాలు మరింత విశాలములైనవి. విస్ఫారిత నయనాలతో నాకేసి పరిశీలనగా చూస్తూ "మీరా!" అని ఒక క్షణ మాగి, "నిన్నంతా మీ కోసమే వారు కాచుకొనిఉన్నారు. ఈనాడైనా మీ కొరకే పని గట్టుకొని విజయవాడ వెళ్ళారు. రండి!" అంటూ ఆమె లోనికి దారితీసింది.

"రేపు సాయంకాలానికల్లా వారు తిరిగి వస్తారనుకుంటాను. నేను వచ్చానని చెప్పండి. తిరిగి రేపు సంధ్యతో వస్తాను'! అలానే వాకిట్లో నిలుచుండి అన్నాను నేను. ఎందుకో నా మాటలు తడబడ్డాయి. ఆమె చిన్నగా నవ్వింది.

ఆ చిరు దరహాసానికి ఆమె ఎడమ బుగ్గమీద చిన్న సొట్ట ఆలా ఉద్భవించి ఈలా మాయమయింది.

"ఎక్కడి కెళతారు? రండి! మరేం ఫర్వాలేదు" అంది.

నేను ఎటూ నిర్ణయించుకోలేక రెండు లిప్తల కాలం త్రొక్కిసలాడాను.

"ప్రఖ్యాత రచయితలు మీరే ఈలా సిగ్గుపడితే ఇక సామాన్య మానవుల సంగ తేమిటి?" ఆమె ప్రశ్నించింది. కాదు, వ్యంగ్యంగా ఎత్తిపొడిచింది.

ఆమె మాటలకు జవాబుగా నేనో శుష్క చిరు దరహాసాన్ని ప్రదర్శిస్తూ లోనికి అడుగు వేశాను.

టేబుల్‌పైన నా లెదర్ బాక్స్ పెట్టి కుర్చీలో కూర్చున్నాను. అరవై కాండిల్స్ పాదరసం నింపిన ఎలెక్ట్రిక్‌బల్బ్ ధవళ కాంతుల్ని విరజిమ్ముతూంది. ముచ్చటగా దిద్దిన బొమ్మరిల్లు లాగుంది ఆ హాలు. గోడలకున్న ప్రకృతి వర్ణ చిత్రాలు, తైలవర్ణ చిత్రాలు, ఆ ఇంటి కామందు కళాభిరుచికి ఉదాహరణప్రాయంగా ఉన్నవి. తెల్లగా పాలనురుగులా శుద్ధంగాఉన్న ఆ గోడలన్నీ తగిలితే మలినమవుతవనేలా అవుపిస్తున్నవి. హాలులోనే ఒకవైపు అందమైన అద్దాల బీర్వాలో వివిధ రకాలైన పుస్తకాలు అందంగా అమర్చబడినవి. ఒక పెద్దపాలిష్‌డ్ టేబుల్, నాలుగు కుర్చీలు, ఒక ఈజీ ఛైర్—ఇవి మాత్రమే ఆ హాల్లో ఉండే ఫర్నిచర్. టేబుల్‌పైనే ఒక చిన్న రేడియో సెట్టు, నాలుగు పత్రికలు ఉన్నవి. నేను వచ్చేసరికల్లా ఆమె చదువుతూందేమో తెరిచిన పుస్తకమొకటి టేబుల్‌పైనే ఉంది. ఏమిటో ఆ

> మానవులు ఈ లోకంలోనే మరణించి తీరాలని ప్రపంచానికి తెలియదు. ఈ సత్యంతెలుసుకొన్న వారు మాత్రం తక్షణమే తమ కలహాలకు స్వస్తి చెప్పుతారు.

పుస్తకమని ఉత్కంఠతతో అటువైపు చూచాను. అది ఒక ప్రఖ్యాత ఆధునిక ఆంధ్ర కవి విరచితమైన గేయ సంపుటి! తలుపు తెరుస్తూనే నా హృదయపు లోతుల్లో హత్తుకుపోయిన ఆమె దర్శనమూ—ఆ గదీ—ఇదంతా నేను కల గనటంలేదు కదా అని అనుకున్నాను. కనురెప్పలల్లార్చి మరీ చూచాను. కాదు. కల కాదు, యథార్థమే!

ఆమె టేబుల్‌ను సమీపించి తను చదువుతూన్న ఆ పుస్తకాన్ని తీసుకుని నాకు చేరువనే మరో కుర్చీమీద కూర్చుంటూ, "రెండు నిమిషాలు విశ్రాంతి తీసుకోండి, అంతలోనే పని మనిషి వస్తాడు. స్నానం చేద్దురుగాని" అంది. గంగిరెద్దులా నేను తలూపాను.

సన్నిహితులైన మిత్రు లందరితోను "వస పోసిన పిట్ట" అనిపించుకునే నేను ఆమెముందు ఏమీ మాట్లాడలేకపోతున్నాను. నా గొంతు మూగవోయింది. మానవ మనస్తత్వాల్ని ఆధారం చేసుకుని ఎన్నో కథ లల్లిన నేను సరిగ్గా, అప్పుడు నా మనస్తత్వ మేలా ఉందో, నాలో ఏయే భావా లిట్టేవచ్చి పోతున్నాయో ఊహించుకోలేని పరిస్థితిలో పడ్డాను. అయినా, ఆమె మనస్తత్వాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను! ఎంత బావుంది!

రాత్రి సమయం. భర్త ఊళ్ళోలేడు. తను ఒంటరిగా ఉంది. నన్ను నా మానాన వెళ్ళిపోనీకుండా బలవంతంచేసి ఎందు కాపాలి ఈవిడ! పోనీ కనీసం సన్నిహితుడైన బంధువునో, కుటుంబ మిత్రుణ్ణో అయినా ఫర్వాలేదు. అదీ లేదు. పరిపూర్ణరావుతోనైనా నా పరిచయం చాల తక్కువదేనని చెప్పుకోవాలి. "రండి! ఫర్వాలేదు." "మీరే ఇలా సిగ్గుపడితే మరి సామాన్యుల మాటేమిటి?" ఇవీ ఆమె అన్న రెండు వాక్యాలు. ఎంతో చనువూ, మరెన్ని నాళ్ళనుంచో పాతుకపోయిన స్నేహమూ ఉంటేతప్ప ఎవరూ ఈలా మాట్లాడరు. ఆలోచిస్తున్నాను నేను. ఆమె తల వంచుకుని పుస్తకంలో లీనమయింది. లయపూర్వకంగా ధ్వని చేస్తున్నట్లున్న గడియారపు టక టక ధ్వనితప్ప గదంతా బహు ప్రశాంత నిశ్శబ్దం ఆవరించుకున్నట్లుంది. మరో మారు గది నలుమూలలా పరికించి నా ఆలోచనల్ని పొడిగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాను.

పచ్చ కళ్ళద్దాలు పెట్టుకున్న వాడికి ప్రపంచమంతా పచ్చగానే అవుపించినట్లు, మానవుడిలో ఉద్భవించే ఆలోచనా స్రవంతులు కూడ వాని భావ ధోరణికి ప్రతిబింబాలుగా ఉంటాయనే చిన్న సత్యాన్ని నే నానాడు గమనించలేకపోయానని అంగీకరించక తప్పదు.

ఇంతలో చేరవేసిన తలుపు కిర్రుమంది. ఏభై ఏళ్ళు పైబడ్డ వృద్ధు డొకడు చేతిలో నాలుగు బత్తాయిపళ్ళతో లోనికొచ్చాడు. ఆమె తలెత్తి చూచి "తాతా! నేన్నీళ్ళున్నాయి గదూ!

# దేవత

రాజారావుగారికి స్నానానికి సిద్ధంచేయి!" అని ఆజ్ఞాపించింది.

ముసలి నౌకరు పళ్ళు టేబుల్‌మీద పెట్టి బోసినోటితో నవ్వుతూ, "ఆ బాబు అలా వెళ్తే మీ రీలా వచ్చారు! బావుంది" అంటూ లోనికి నడిచాడు.

"మీరు భోంచేస్తారా! లేక టిఫిన్ తీసుకుంటారా!" ఆమె పుస్తకంలో దృష్టుంచే నన్నడిగింది.

"ఆ.....నాకేం ఆకలి వేయటం లేదండీ! ఏమీ వద్దు." నసిగాను నేను.

ఆమె ముఖంలో ఒక చిరు దరహాసం అవుపించీ అవుపించనట్లు కన్పించింది. అంతలోనే వృద్ధ నౌకరునుంచి స్నానానికి పిలుపు రావటం, నేను లోనికి పోవటం జరిగాయి.

నేను స్నానంచేసి వచ్చేసరికల్లా టేబుల్ మీద పళ్ళెంలో రెండు మూడు రకాలైన బిస్కెట్లు, ఏపిల్ పళ్ళ ముక్కలు అమర్చబడి ఉన్నాయి. నామోషికి ఆకలిలేదని అన్నాను గాని ఆ తినుబండారాల్ని చూస్తుంటే ఆకలేస్తున్నట్లు అవుపించింది. అందుచేతనే అట్టే బలవంతం చేయించుకోకుండా టిండికి తల పడ్డాను.

"ప్రచురింపబడ్డ మీ కథలన్నీ చదువుతూ ఉంటాను. ఎలా వ్రాయగలుగుతారండీ అంత బాగాను! అవి చదువుతూంటే ఒక్కొక్కప్పుడు నా మనసులోని మూగ ఊహలకు మాటలు పొదిగారాయన అనిపిస్తుంది. నేనేగాదు. నా మిత్రుల్లో చాలమంది కూడ ఇదే అభిప్రాయాన్ని వెలువరిస్తూ ఉంటారు" అందామె.

అంతవరకు తలవంచుకుని తిండి ధ్యాసలో పడ్డ నేను తల ఎత్తి ఆమెవైపు చూశాను. ఆమె నాకేసే చూస్తూంది. నాకు గుర్తొచ్చిన తర్వాత ఈ పాతికేళ్ళలోను ఏనాడూ నేనంత ఆనందపడలేదు. అవును! కవికిగాని, కళాకారునికి గాని తన కళను పొగిడితే ఎంతో ఆనందమవుతుంది. అందులోనూ అంత అందమైన స్త్రీ, అపురూప సౌందర్య కళాభిజ్ఞురాలు ఆలా నా రచనల్ని ఆకాశాని కెత్తితే—జీవితం చరితార్థమైందనుకున్నాను. అవును! చాలు....నా జీవితానికి, నా కళా తపస్సుకు ఈ ఒక్క ప్రశంస చాలు! వర్షాగమన సమయంలో పురి విప్పిన మయూరంలా నాహృదయం నాట్యమాడుతూంది.

> *సత్యాన్ని సత్యంగాను, అసత్యాన్ని అసత్యంగాను తెలుసుకొన్నవారు సత్యాన్ని దర్శిస్తారు. సత్యాన్నే కాంక్షిస్తారు.*

ఆనందోద్వేగాన్ని అణచుకుంటూ...."మీ సహృదయాని కాలా అవుపించటంలో వింతేమీ లేదు" అన్నాను కొద్దిగా సిగ్గుపడుతూ నేను.

పరిపూర్ణ చంద్రబింబంలాంటి ఆ వదనంలో తిరిగి ఒక దరహాసరేఖ తళుక్కుమని మాయమయింది.

"తాతా! రాజారావుగార్ని మేడమీది పడమటి గదిలోకి తీసుకెళ్ళు. దూర ప్రయాణం! ఎంతో అలసిపోయి ఉంటారు" అందామె.

నేను నా కృతజ్ఞతాభావం వెలువరించేందుకు మాటలకోసం తచ్చాడి, ఆమె వైపొకసారి చూచి నౌకరు తాత ననుసరించాను.

## 2

పరిపూర్ణరావు లక్షాధికారి. తర్వాత కొన్ని తరాలవరకు నిక్షేపంగా బ్రతికేందుకు వీలయినంత ఆస్తి మిగిలించి చక్కాపోయారతని పెద్దలు. కృష్ణ ఒడ్డున సారవంతమైన పొలాలనుంచే ఏటా ఐదారువేల రూపాయలు కౌలు రూపంలో వస్తుంది. బోలెడంత డబ్బు ప్రతి నెలా విజయవాడనుంచి ఇంటద్దెల రూపంలో కూడ వస్తుంది. ఒక రోజు విజయవాడ శివార్లలోని కృష్ణలంకలో ఆ రూమ్‌లో ఒంటరిగా కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాను. హఠాత్తుగా నా మిత్రుడు భాస్కరమ్ మరో అతన్ని వెంటబెట్టుకొని గదిలో కొచ్చాడు. రిమ్‌లెస్ కళ్ళజోళ్ళు, పెద్దాపురం శిల్క్ జుబ్బా, కొనదేరిన నాశికాగ్రము, దబ్బపండు వంటి శరీర చ్ఛాయ—కులాసా పురుషుడులా అవుపించాడు. అతనే పరిపూర్ణరావు. ఇష్ట గోష్ఠులతో ప్రారంభమయిన మా సంభాషణ సాహిత్యం మీదికి మరలింది. ఆంధ్ర కవితా రీతులతో పాటు తెలుగుతోబుట్టు భాషల్లోను, ఇతర దేశీయ భాషల్లోను కనుపిస్తున్న నూతన కవితా రీతుల్ని గురించి, వివిధ మహా కవుల రచనలను గురించి మా సంభాషణ జరిగింది. పరిపూర్ణరావు నా కవితా వ్యవసాయాన్ని గురించి, అందులోను ముఖ్యంగా కథానికా రచనలో నేను *అవలంబిస్తున్న నూతన రీతులను గురించి*, ఎంతగానో మెచ్చుకున్నాడు. అతని అభిమాన రచయిత నన్నాడు. నేను అతని పొగడ్తలకు కొద్దిగా సిగ్గుపడుతూ ".....ఏదో నా చేతనైనంత కృషి. తెలుగు సరస్వతి సిగలోకి నేనో నూతన పుష్పాన్ని తురిమేందుకు మాత్రమే కృషి చేస్తున్నా"నని చెప్పుకున్నాను. నా ప్రచురింపబడ్డ అరడజన్ పుస్తకాలు అడిగి మరీ తీసుకున్నాడు పరిపూర్ణ.

మరో గంట, గంటన్నరకుగాని మా సంభాషణ ముగిసింది గాదు. సెలవు తీసుకొని పోబోతూ అతడు నా చేతిలో మడిచిన వంద రూపాయల నోటు బెట్టాడు. మొదట నేను విస్తుపోయినా వద్దని నిరాకరించాను. కాని అతడు 'ససేమిరా' వెనుక్కు తీసుకోలేదు. సాహిత్యప్రియులైన

నా పాఠకుల్లో ఒకరిచ్చిన చిన్ని కానుకగా పరిగ్రహించక తప్పదన్నాడు. భాస్కరవ్ కూడ పరిపూర్ణరావును బలపరిచాడు. మరి అడ్డు చెప్పేందుకు వీలుకాక ఆ వంద రూపాయల నోటు తీసుకొని జేబులో తురుముకున్నాను.

బాజుపట్టిన నా చిన్ని గది—విరిగిపోయిన కుర్చీ— ఊగిసలాడుతున్న మేజా—క్రింద పరిచిన చింకు సిరిచాపలు— ఇవి చూచేనేమో సానుభూతితో అతనీ పని చేసింది ?

ఇది మొట్టమొదటిసారి నాకు పరిపూర్ణరావుతో ఏర్పడిన పరిచయం.

తర్వాత రెండు మూడుసార్లు బజారులో తటస్థపడటం, చిరునవ్వులు చిందిస్తూ పలకరించటం జరిగింది. అతడు కలిసినప్పుడెల్లా నా రచనల్ని గురించి, నా కథా కథన విధానాన్ని గురించి తెగ మెచ్చుకుంటూ ఉండేవాడు.

పది రోజులనాడు హఠాత్తుగా ఊడిపడ్డాడు భాస్కరవ్ నా గదిలోకి. రావటంతోనే "మమ్మల్ని పూర్తిగా మరిచిపోకు భాయీ!" అన్నాడు.

ఏమిటన్నట్లు నేను కళ్ళతోనే ప్రశ్నించాను. భాస్కరవ్ గడుగ్గాయి. పైగా నాబాల్య మిత్రుడు. నాతో ఎంతో చనువు. ఒక పట్టాన చెప్పాడా?

"శుభవార్త చెబితే నాకేం బహుమతి ఇస్తావో చెబితే" అన్నాడు.

అతడు మారాంచేసే కొద్దీ నాలో ఆత్రుత ఇనుమడించింది. రెండు మూడుసార్లు "ఏమిటో చెప్పరాదూ!" అని దబాయించాను. కాని లొంగే రకం కాదుగా!

హఠాత్తుగా నాకో విషయం గుర్తుకొచ్చింది. ".......మంచి పదినెమ్మను చూచి పెళ్ళి చేస్తేకాని నీ జబ్బు నయం కాదు. ఏమిటోయ్ నీ అశ్రద్ధ! జీవితమంటే నిర్లక్ష్యమూ, ఆరోగ్య మంటే ఖాతరు చేయని తత్వమూను" అని పలుమార్లనేవాడు భాస్కరవ్. పైగా రెండు రోజుల క్రిందట తనో సంబంధం చూస్తున్నట్లుగా కూడ సూచించాడు. నేను వివాహానికి విముఖుణ్ణి. నాకున్న జీవితంలో ఆ కర్మకాండ అత్యంత అవసరమని భావించినప్పుడు చేసుకోవాలనే తత్వంగలవాడను. పైగా ఇనుప గజ్జెల తల్లికి నాకుగల దోస్తీ అత్యంత అధికమైనది గూడ. ఈ ఆలోచన రావటంతోనే గాభరా పడ్డాను. కొంపదీసి వీడిప్పుడే ఏ సంబంధాన్నో సెటిల్ చేసుకురాలేదు గదా! "అరే బాబూ! నీవు కోరింది సమర్పించుకుంటాను. ఏమిటో చెప్పు" అన్నాను ఎంతో ప్రాధేయపడుతున్నట్లు.

వాడు జేబులోనుంచి ఒక కవరుతీసి నా చేతిలో పెట్టాడు.

అది నాలుగు పేజీల ఉత్తరం. పరిపూర్ణరావే లేఖకుడు! క్లుప్తంగా ఆ ఉత్తరంలోని విషయా లివి.......వ్యాపారపు విధానాలను గాని, లాభార్జనను కాని దృష్టిలో ఉంచుకోకుండా కళా విలసితంగా అలరారే విజ్ఞానదాయకమైన ఒక ఉత్తమ చలన చిత్రాన్ని తను నిర్మించాలని అనుకున్నాడట. ఇరవయ్యవ శతాబ్దపు శిఖరాలంటుకుంటున్న అత్యున్నతమైన ఈ నాగరక యుగంలో సినిమాలా ప్రజల్ని ఆకట్టగల కళ వేరొకటి లేదని, కాని దురదృష్టవశాత్తు ఆ కళ వ్యాపార మార్గంలో నిర్వహింపబడుతూ కొందరు వ్యక్తుల స్వలాభంకోసం బలి గావింపబడుతూందని—అలా కాకుండా తను ఉన్నత ప్రమాణాలతో, సరికొత్త విధానాలతో చిత్రం నిర్మించదలచుకున్నానని, అనుభవజ్ఞుడైన మంచి డైరెక్టర్ కూడ అందు కంగీకరించాడని వ్రాశాడు పరిపూర్ణరావు. పోతే, తను నిర్మించబోయే చిత్రానికి రచయితగా నన్నెన్నుకున్నాడు. తన కోరిక నిరాకరించననే విశ్వాసాన్ని బలంగా ధ్వనించి, నా భావాలతనికి బాగా తెలుసునని, రచయితగా నా స్వేచ్ఛాస్వాతంత్ర్యా లపహరింపబడకపోవటమే గాకుండా ఎంతో గౌరవింపబడతాయని కూడా హామీ ఇచ్చాడు. ఏ విషయం వెంటనే తెలియజేస్తే తర్వాతి కార్యక్రమానికి పూనుకుంటాడట పరిపూర్ణరావు.

"ఏమండోయ్! సినిమా కవిగారూ! తమ రంగీకరించరని నన్ను సిఫారస్ చేయమని పనిగట్టుకొని మరో పెద్దఉత్తరాన్ని నాకు కూడా వ్రాశాడు పరిపూర్ణ" అన్నాడు భాస్కరవ్.

ప్రపంచంలో అందరి మానవుల్లాగే కళాకారులు కూడ రెండు తెగలకు చెంది ఉంటారు. ఒకరు ఆశయాలకోసం బ్రతుకుతే మరొకరు బ్రతకటంకోసం ఆశయాల్నేర్పరచుకుంటారు. సంఘంలో ఉన్నతదశ చేరేందుకు నాకూ జీవితంలో ఎన్నో అవకాశాలు వచ్చాయి. వాటిలో ఏ ఒక్కదాన్ని ఆశ్రయించి ఉండినా నా జీవితగతి మరోవిధంగా ఉండేది. దరిద్రము, ఆకలి, ఆవేదన నాకు దూరమై ఉండేవి. గాలిచొరని గొందిలోని గదిస్థానే విశాలమైన భవనము, ఒంటరి జీవితానికి బదులు సుఖశాంతు లిచ్చే జంట జీవితము, బిక్కుబిక్కుమంటూ గదిలో కూర్చోకుండా చుట్టూ చేరే భజనకూటాలు—అన్నీ లభించిఉండేవే!

అందుకే పరిపూర్ణరావు ఉత్తరము నాకేమీ ఆనందం గలిగించలేదు. నిర్లిప్తంగా చిన్నగా నవ్వాను. అంతే!

భాస్కరం మహాబలవంతం చేశాడు. పరిపూర్ణరావును గురించి నిజంగా నేనేమైనా తెలుసుకొనిఉంటే నే నిలా ఆముదం తాగినవాడిలా ముఖంపెట్టేవాడిని కాదన్నాడు. అతని యాజమాన్యంలో రచయితగా నా భావాలకు విఘాతం ఏమీ కలుగదని హామీ ఇచ్చాడు. తద్విరుద్ధంగా ఆలాంటి సూచ నేమైనా అవుపిస్తే అప్పుడే తప్పుకోవటంలో బాధేముందని ప్రశ్నించాడు. "నీ భావాలు లక్షలాది జనసమూహాలముందు సజీవంగా నడయాడబోతూంటే జంకు



## వలపు తలపులు

చిత్రం—వీరిశెట్టి అచ్యుతరావు

(పుల్లేటికుర్రు)

పుట్టుకొస్తూందా?" వ్యంగ్యంగా ఎత్తిపొడిచాడు భాస్కరవ్. "స్వేచ్ఛాస్వాతంత్ర్యాలంటూ ఇలా మడిగట్టుకు కూర్చోవటం పిరికిపందల లక్షణమే గాకుండా నీ వారాధించే పవిత్రకళామతల్లికి ద్రోహం చేసినట్లవుతుంది" అని కూతలు వేశాడు.

తర్వాత నేనుకూడా తాపీగా యోచించాను. భాస్కరవ్ మాటల్లో సత్య మెంతో ఉన్నట్లు నా కవగతమైంది. నా అభిప్రాయాలక్కడ పొసగకపోతే తప్పుకోవచ్చని సరిపెట్టుకున్నాను. తత్ఫలితమే మరునాడు పరిపూర్ణరావుకు నా అంగీకారం తెల్పుతూ ఉత్తరం వ్రాయటం.

నాలుగురోజుల క్రిందట పరిపూర్ణరావు అయిదు వందరూపాయనోట్లతో సహా ఒక ఉత్తరాన్ని నాపేర ఇన్స్యూర్ చేశాడు. పందొమ్మిదవ తేదిన గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి రావలసిందని, తను స్టేషన్‌వద్దనే నిరీక్షిస్తూ కూచుని ఉంటానని కూడా వ్రాశాడు. ఆ రెండు మూడు రోజులు విజయవాడలో నా పనులన్నీ చక్కబెట్టుకొని సరిగ్గా అతడు వ్రాసినట్లే బయలుదేరుదామనుకున్నాను. కాని రెండు నిమిషాల్లో ట్రెయిన్ తప్పిపోయింది. అక్కడికీ నన్నంటిపెట్టుకొని ఉన్న భాస్కరవ్ ఎంతో తొందరపెడుతూనేఉన్నాడు.అయినాప్రయోజనం లేకపోయింది. నేను మనసు మార్చుకున్నానను కున్నాడేమో పరిపూర్ణ తనే బయలుదేరాడు విజయవాడకు మరునాడు. నేను ఇలా వచ్చాను.

### 3

మేడమీదిగదిలో మెత్తటి పరుపుమీద

పడుకున్నాను. తెరిచిన కిటికీలోంచి చల్లనిగాలి మెల్లగా వీస్తూంది. పచ్చటి చిన్నిబల్బు ఇస్తున్న వెలుగుకు తెల్లగోడలు కూడ పచ్చదనాన్నే వరిస్తున్నట్లున్నవి. దూరప్రయాణంచేసి బడలికచెందిన శరీరానికి పడుకున్న వెంటనే నిద్రబడుతుందనుకున్నాను. కాని,కళ్ళు మూతలే పడటంలేదు. నా రెండు కళ్లముందు ఆమె సౌందర్యచ్ఛాయలు నడయాడుతున్నట్లున్నాయి. ఆమె రూపు నా హృదయంలో హత్తుకుపోయినట్లుంది. జీవితంలో ఏనాడూ రుచి చూడని వింతభావాలు మనసులో మెలికలు తిరుగుతున్నాయి. రెండు దశాబ్దాలపాటు నే నార్జించిన విజ్ఞానము, అలవరచుకున్న సంస్కారము,అభిమానించిన ఆశయాలు— ఒక్క క్షణంలో— అవును! ఒక్క లిప్తకాలంలోనే మొదలంట కూలటమా? పరాయి స్త్రీ, అందులోనూ నా మీద అపారగౌరవాదరణ లుంచిన మిత్రుని భార్య! ఛీ! అంతవరకు నేను చేసిన ఆలోచనల మీద, నే ననుభవించిన వింత అనుభూతిపైన నాకు మహా అసహ్యం కలిగింది. భూమండలం సృష్టింపబడ్డ తర్వాత తరతరాల మానవుల అమోఘశ్రమ ఫలితంగా ఎంతో నాగరకత వికసించింది. పశుతుల్యుడుగా ఉండిన మానవుడు పరమాణువునే విభజించేంతటి నాగరకతను అలవరచుకున్నాడు. ప్రకృతినే పరిహసించే దశకుకూడ చేరుకుంటున్నాడు. అయినా అనాది సిద్ధమైన ఆ పశుత్వం మానవ మేధస్సు నుంచి పూర్తిగా వైదొలగలేదేమో! లేకపోతే, ఏమిటీ ఆలోచనా రీతులు? ఆమె నా కళ్లబడ్డక్షణం నుంచి నేనే ఏవేవో పనికిమాలిన భావాల్ని తెచ్చి పెట్టుకొని, అతి నీచంగాను, సంకుచితంగాను ఆమెను గురించి యోచించాను. పైగా అతిథేయ మర్యాదలకు అనాదికాలంనుంచి పేరుబడ్డ ఒక భారత స్త్రీ నన్నాదరించటమేనా నే నలా అనుకోటానికి కారణం!!! ఆమె చదువుకున్నావిడ,నాగరక సమాజంలో తిరుగనేర్చిన సంస్కారరాలు. అందుకే ఏ అరమరికలు లేకుండా నన్ను ఆదరించి ఉంటుంది. దాన్నాధారం చేసుకొని నే నేమేమో తలపోశాను. పైగా నా వ్రాతల్లో స్త్రీ పురుష సమానత్వాన్ని గురించి పుటలకు పుటలు తెగవ్రాస్తాను! నేను సృష్టించే పాత్రలచేత ధర్మోపన్యాసాలు దంచిస్తాను. నేనే ఇలా భావిస్తే, ఇక సామాన్యుల మా టేమిటి?

ఇలా ఆలోచిస్తూంటే నామీద నాకే ఎంతో అసహ్యం వేసింది. పశ్చాత్తాపాగ్నిలోపడి నా దేహం కాలిపోయినట్లనిపించింది. ఏది ఏమైనా ఇకమీదట నాలో ఆలోచనా రీతు లామాదిరిగా ఉండకూడదు.

బాలభానుని సూర్యకిరణాలు సోకి ఉలిక్కిపడి లేచాను. క్రింది హాల్లో గడియారం కొట్టిన ఎనిమిది ఘంటలు స్పష్టంగా వినిపించాయి. ఒళ్లంతా బద్ధకంగా ఉంది. నరాలు జివ్వున

# దేవత

లాగుతున్నట్లున్నాయి. గట్టిగా ఆవలించి ఎదురుగా ఉండే నిలువుటద్దం ముందు కెళ్లి నిలుచున్నాను. రెండు కళ్ళూ ఎర్రగా జ్యోతుల్లా కెంపుకాంతులీనుతున్నాయి. నా ప్రతిబింబం నన్నే వెక్కిరించినట్లుంది. ఒకేఒక్క రాత్రిలో ఒక దశాబ్దం గిర్రున తిరిగిపోతే ఎంతమార్పు, ఎంత దిగ్భ్రాంతి ఒక్క ఉదుటుగా ఎలా ఉద్భవిస్తావో అలా ఉంది నా పరిస్థితి.

"హల్లో!"

తలవెంట్రుకలు సవరించుకుంటున్నవాడినల్లా ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాను. నా ఎదురుగా పరిపూర్ణరావు! అనవరతమూ నడయాడే దరహాసము అతని ముఖాన ఈనాడు మరీ స్పష్టంగా అవుపిస్తున్నట్లుంది. చిరుగాలి కెరటంలో, మల యూట కాల్వలో, పసిపాప చిరు దరహాసంలో ఉండే మధురిమ అతని ఆ చిన్ని దరహాసంలో నా కవుపించింది. స్వతహాగా మృగసంతతిమంచి జన్మించిన మానవుణ్ణి కాబట్టేనేమో నాకు తెలియకుండానే అతన్ని చూస్తూనే ఏదో అసూయభావం నా హృదిలో తలుక్కుమని మెరిసినట్లయింది!

"రాత్రి బాగా నిద్రపట్టలేదనుకుంటాను. ఏం! సౌఖ్యంగాలేదా!" ప్రశ్నించాడు పరిపూర్ణరావు.

నా ఎదలో మెదిలే సిగ్గుమాలిన భావాలకు దర్పణంగా నా ముఖం కనుపిస్తూందేమో! లేని చిరునవ్వు తెచ్చి పెట్టుకుంటూ "నిన్నటి రైలు ప్రయాణంలో బొగ్గు నెరుసులు కళ్లలో పడ్డట్టున్నవి. అంతే!" అన్నాను.

నేను బయలుదేరిన సంగతి విని వెంటనే తిరుగు ప్రయాణం కట్టేశాడట పరిపూర్ణరావు. చీకటితెరలు విచ్చుకునేసరికల్లా తిరిగి ఇల్లు చేరుకున్నానని చెప్పాడు.

పరిపూర్ణరావు భార్యపేరు అరుణ అని తెలుసుకున్నాను అతడు పిలవటం మూలాన. ఆ ఉదయం కాఫీటేబుల్‌ముందు ఆమె వంక మాటిగా చూచేందుకే సిగ్గుపడ్డాను నేను. ఏలా చూడగలను? ఆమెను గురించి రాత్రంతా ఏమిటేమిటో ఆలోచనలు చేశానయ్యె! విషపూరితమైనటువంటి, పశువాంఛాదీప్తమైనటువంటి ఆ ఆలోచనలే నన్ను సిగ్గిల చేస్తున్నవి.

"మరో ఇడ్లీ వేసుకోండి!" అంటూ నావైపు పరిశీలనగా చూచినావిడ, "ఏమిటండీ! జబ్బేమైనా

> అసత్యాన్ని సత్యమని భ్రమించేవారు, అసత్యంలో సత్యాన్ని దర్శించేవారు సత్యాన్ని తెలుసుకొనలేరు. వారు వ్యర్థమైన కోరికల సాఫల్యానికి యత్నిస్తారు.

చేసిందా? కళ్లెర్రగా ఉన్నవి! ముఖమంతా..!" అని ప్రశ్నిస్తూంది. మతి మెత్తనైన ఆ స్వరంలో స్త్రీత్వము పంచమ స్వరంలో పలికినట్లుంది. ఆ స్వరంలో ఆందోళన, జాలి, మాతృత్వము గూడుకట్టుకొని ఉన్నట్లున్నవి.

నేనేమని జవాబీను?

ఆమె ప్రశ్నకు నిజమైన జవాబిస్తే!— ఆమె ముఖములోని చిరు దరహాసం అలానే ఉండగలదా? ప్రక్కనే కూర్చునిఉన్న పరిపూర్ణరావు ముఖంలోని ప్రశాంతత పారిపోకుండా ఉండగలదా? నేనో సిగ్గుమాలిన వాడిగానో, ఉన్మత్తునిగానో భావింపబడి ఆ పరిసరాలనుండి గెంటింపబడకుండా ఉండగలనా?అంత విషాదంలోనూ మనసులో మెల్లగా నవ్వుకున్నాను.

"అ... ఏమీలేదండి!" చప్పరించాను.

మన జీవితాల్లో అనుక్షణం ఆత్మవంచన చేసుకోవటం తప్పనిసరేమో! మానవ హృదయాల్లో అనవరతమూ ప్రభవించే ఆలోచనారీతుల్ని ఎప్పటికప్పుడు ఇతరుల ఎదుట బయట పెడుతూఉంటే ప్రపంచమేలా ఉంటుందో!

ఆ సాయంకాలం పరిపూర్ణరావు, నేను చలనచిత్ర కథావస్తువునుగురించి చర్చించుకున్నాం. ఎంతఖర్చయినా వెనుదీయకుండా ఉత్తమకళాఖండాన్ని నిర్మించాలనే అతని పట్టుదలకు, కళా పిపాసకు నేను ముగ్ధుణ్ణయ్యాను. "బోలెడంతభవనం, మేడంతా మీరు పూర్తిగా వాడుకోవచ్చు. మీ ప్రశాంతతకేలాటి భంగమూ ఉండదు. ఇక మీరు కథ రచనను ప్రారంభించండి!" అన్నాడు పరిపూర్ణరావు.

పరిపూర్ణరావింటిలోనా నానివాసం! హా! వద్దనుకున్నాను. నాకు ఆత్మవిశ్వాసం సడలుతూంది. నా నైతిక విలువల పునాదులు తుఫాను గాలికూగే చిరుమొక్కల్లా అరుణాదేవి సందర్శనములో ఊగులాడుతున్నవి. ప్రతిక్షణం ఆమె ఎదుటనే, ఆమె నివసించే ప్రదేశంలోనే నా ఆవాసమైతే మహాకష్టమైన విషయం!

"వేరే గది చూచుకుంటాలెండి!" నసిగాను నేను.

నా సంశయాత్మను చూచి పరిపూర్ణరావు ఆశ్చర్యపోతూ "ఏం! మామేడ బావోలేదా?"అని ప్రశ్నించాడు. "బావులేకకాదు. నావల్ల మీకు.." అర్థోక్తిలోనే ఆగాను.

పరిపూర్ణరావు బిగ్గరగా నవ్వాడు. "ఫర్వాలేదు. నేనింకా మీకు నచ్చలేదేమోననుకుంటున్నాను. మాకేం కష్టం? లంకంత కొంప? మావి రెండు ప్రాణాలు" అని అసంభాషణను అక్కడికే త్రుంచివేశాడు. నేనేవో చెప్పాలనుకున్నా వీలయిందిగాదు. తర్వాత మామాటలు మరో వైపుకు పయనించాయి.

ప్రకృతిలో మహాఆశ్చర్యమైంది స్త్రీ పురుష ఆకర్షణశక్తి! నాగరకత రోజురోజుకూ అభివృద్ధి చెందుతూన్నా, మనస్తత్వ శాస్త్రజ్ఞులు

ఇతోధికంగా తయారవుతూన్నా ప్రకృతిలోని ఈ పరస్పర ఆకర్షణశక్తికి కారణాలు కనిపెట్ట లేకపోతున్నారు. అందులోనూ ఏ ఒక్కరి మీదనే మనసు కేంద్రీకరింపబడటం ఎందుకో! మంచిచెడ్డలు, సాధ్యాసాధ్యాలు ఇవేమీ అక్కరలేదు పైతత్వానికి. అవతలి వ్యక్తి తన్నేలా భావిస్తుందా అనే ప్రశ్నకూడ రాదు. ఊరకే మరులు పెంచుకోవటము, ఆరాధించటం, బాధ పడటమూను. మానవ చరిత్ర ప్రారంభ మయిన నాటినుండి ఇది ధారావాహికంగా వస్తూనే ఉంది. చర్వితచర్వణ మవుతూనే ఉంది. దేశదేశాల్లోని మహాకవుల కావ్యాలు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నవి కాని జవాబుమాత్రం కనుపించడంలేదు.

మనసుకు సంబంధించిన ఈ విషయాన్ని గురించి ఆలోచించేటప్పుడు హేతువాదం ఏమీ పనిచేయదేమో! భౌతికమైన కారణా లుండవు. అది అతి సున్నితమైన ఒక మధుర భావన మాత్రమే!

ఏది ఏమైనాసరే నేను నైతికంగా పద భ్రష్టుణ్ణి కాకూడదు. నమ్మిన మిత్రుణ్ణి ద్రోహం చేయకూడదు. ఆమెను గురించిన ఏ కల్మషాత్మతో కూడిన ఆలోచనముకాని దరికి చేరనీయకూడదు. ఆమె నాతల్లి! నాతోబుట్టువు! మనసులోనే గట్టిగా మననం చేసుకున్నాను.

## 4

నాలుగయిదురోజులు గడిచిపోయాయి. నేను వ్రాయాలనుకున్న కథ ఒక పేజీకూడ సాగ లేదు. అయినా బాధేంలేదు! నన్ను నేను అదుపులో పెట్టుకుంటున్నాను. భోజనానికి తప్పిస్తే మేడదిగి క్రిందికే పోవటంలేదు. ఎప్పుడైనా ఆమెతో మాట్లాడవలసివస్తే ముక్తసరిగా మాట్లాడేవాణ్ణి. గలగలా పారే సెలయేటి లాంటిదామె. నిత్యోత్సాహి. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడేది. ఆమెకెన్నో సందేహాలు. మిలమిలా మెరిసే కళ్లతో మాటిగా నావంకే చూస్తూ ఏవేవో ప్రశ్నలు వేసేది.

అపురూపమైన విలువగల వజ్రానికి కాఠిన్యమున్నట్లే స్త్రీ సృష్టికూడ నేమో! పూర్వకాలంలో రోమన్ స్త్రీలు ఖైదీలను సింహాలు పీక్కుతింటూంటేచూచి చప్పట్లుచరిచి ఆనందించేవారట! నా మనోగతభావాలు ఆమెకు తెలుసునో తెలియదో నా కవసరం లేదు. ఆమె పాటికి పలుసార్లు నాతో చనువుగా మాట్లాడటం, చిరునవ్వులు చిందించటం—నాపాలిటికి ఆనాటి రోమన్‌ఖైదీ బాధ కంటె తక్కువైనదేమీ కాదు! కానా ఈ పోరాటంలో విజయుణ్ణి కావాలనే దృఢనిశ్చయం నాకుంది.

సాయంకాలం ఆరుఘంటలయి ఉంటుంది. మేడమీది మండువాలో ఈజీఛైర్‌లో పడుకొని పశ్చిమాకాశంలోనికి పరికించి చూస్తున్నాను. అస్తంగత అరుణ కిరణాలు నయనానందకరంగా ఉన్నవి. ఛాయానాథుడు ప్రేయసి సన్నిధికి పరుగులుతీసే ప్రేమికుడులా పశ్చిమాద్రిలోకి పరుగులుతీసి పయనిస్తున్నాడు. చల్లని గాలి మెల్లగా వీస్తూంది. కళాహృదయ మున్నవారికి ప్రకృతే ఒక పెద్ద చిత్రపటం! ఏ ప్రఖ్యాత చిత్రకారుడి కుంచెకూడ పూర్తిగా చిత్రించ లేని చిత్రాంశాలు ప్రకృతి వర్ణనటంలో కోకొల్లలుగా ఉన్నాయి.

"ఏమండీ!"

అర్ధనిమీలిత నేత్రాలతో ప్రకృతి సౌందర్యాస్వాదన చేస్తున్న వాణ్ణల్లా ఉలిక్కి పడి వెనుదిరిగి చూశాను. చేతిలో ఒక పుస్తకంతో అరుణ నా వెనుక నిలుచుని ఉంది. ఎర్ర గోరంచు తెల్లటి చీర, తెల్లటి నౌనల్ని ముద్దు పెట్టుకుంటున్న నూనె రాసుకోని కాటుక కురులు—విశ్వామిత్రుని తపో భంగాని కవతరించిన మేనక అరుణాదేవి ముందు దీటుగాదేమో! ఆమె రాకతో మెల్లగా వీచే చల్ల గాలికి జాజిపూల సువాసన కూడ అబ్బింది.

"ఏమిటండీ! అలా చూస్తారు? నన్నాధా రంగా చేసుకొనే వ్రాశారు మనూ మీ కథను?" ఆమె కిలకిలా నవ్వింది.

ఆమె ప్రవర్తనకు నేను విభ్రాంతుడనయాను. అణగారిపోయేలా చేసుకుంటున్న నాలోని వాంఛలు, ఆవేదన ఉవ్వెత్తుగా ఆ క్షణంలో తిరిగి విజృం భిస్తున్నట్లుంది. నిర్దేశింపబడిన ప్రామాణికను వేడికంటె అధికోష్ణతను కలిగిస్తే లేబరేటరీలోని పరీక్ష నాళిక ఒక్కసారిగా ఏలా పకాలుమని పగిలిపోతుందో అలా ఉంది నా హృదయం. ఏ క్షణమైనా నన్ను కాదని తిరుగుబాటు చెయ్యొచ్చు.

"గంటలకు గంటలు ఒంటరిగా ఇలా కూర్చుంటారే, మీ కెలా ప్రొద్దుపోతుందండీ?" ఆమె తాపీగా ప్రశ్నించింది.

నాలో ఎన్ని అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నవో? ఎంత ప్రచండ ప్రళయ ఝంఝామారుతం వీస్తూందో ఆమె కేం తెలుసు? జవాబుగా ఒక శుష్క చిరు దరహాసాన్ని వదిలాను.

"మీ కభ్యంతరం లేకపోతే మీవద్ద శుశ్రూష చేయాలనుకుంటున్నాను. ఇది చూచి మీ అభిప్రాయం తెల్పండి. మొగమాటానికి బాగుందనేరు సుమండీ! అవసరమైతే చిన్ని చిన్ని మార్పులు చేయండి. చిన్న మార్పులు చేసినా రాణించదని భావిస్తే చించిపారేయండి!" అంటూ అరుణాదేవి పుస్తకంలోనుంచి ఒక కాగితాల బొత్తామునుతీసి నా చేతిలో పెట్టింది. నేను శిలావిగ్రహంలా అలానే నిలబడిఉన్నాను. నా చెయ్యి అప్రయత్నంగానే తన విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చింది.

మెల్లని అడుగుల సవ్వడితోపాటు ఆమె

(తరువాయి 41 వ పేజీలో)



నాగరాజు
(తొమ్మిదవ శతాబ్ది శిల్పం)
ప్రతి చిత్రం—బి. శశి
(చేకుసెట్టి పాలెం)

# దేవత

(25 వ పేజీ తరువాయి)

అదృశ్యురాలైంది.

మిరుమిట్లు గొల్పే ఒక కాంతిరేఖ ఒక్క క్షణంపాటు నా కళ్ళ ముందు నడయాడి యిట్టే మాయమయినట్టుంది అరుణాదేవి రాకడా పోకడాను.

మనసులో ఏదో ఒక వెర్రి భ్రమ తళుక్కున మెరిసినట్టయింది. ఆమె ఇచ్చిన కాగితాల బొత్తాం ఆత్రంగా తీసి చదివాను. 'జీవన పుష్పం' అనే శీర్షికక్రింద వ్రాయబడ్డ చిన్న కథ అది! కథా వస్తువులో ప్రత్యేకతేమీ లేకున్నా మామూలుగా ప్రచురితమవుతున్న చాల కథానికలకంటె ఉన్నతంగానే ఉంది! అరుణాదేవి రచయిత్రి కూడా నన్నమాట! నాకు ఆశ్చర్యానందాలతోపాటు మరేదో నేను మాటల్లో వ్యక్తీకరించలేని ఒక వింతభావం కూడ కలిగింది. ఆమె వ్రాసిన ఆ కథలో మార్పులు చేర్పులు అవసరమని నే వేమీ అనుకోలేదు

సూర్యుడు పశ్చిమాద్రి ఒడిలోకి ఎప్పుడు వెళ్ళాడో నేను గమనించనేలేదు. అజ్ఞానంలా చీకటి బయటి ప్రకృతితోపాటు నన్ను కూడ ఆవరించుకున్నట్లయింది.

"ఎలా ఉందండీ!"

మరునాటి ఉదయం పరిపూర్ణరావు దంపతులు, నేను కాఫీ టేబుల్‌ముందు కూర్చున్నప్పుడు అడిగింది అరుణ.

ఏమిటో అన్నట్టు ఒక క్షణంపాటు ముఖం క్వెశ్చెన్ మార్కులా పెట్టిన నేను వెంటనే తేరుకొని, "ఓ! చాల బావుందండీ! ఏ పత్రికైనా నిరభ్యంతరంగా ప్రచురిస్తుం దనటంలో నా కేం సందేహంలేదు" అన్నాను.

పరిపూర్ణరావు చిన్నగా నవ్వుతూ "ఏమిటో నేను కూడ తెలుసుకోవచ్చా?" అని అడిగాడు.

అరుణాదేవి స్నిగ్ధకపోలాలు లేత అరుణిమను దాల్చాయి. కొద్దిగా సిగ్గుపడుతూ చెప్పి నావైపు చూస్తూ, "నే నెక్కడ చిన్న బుచ్చుకుంటావోనని మెచ్చుకోవటం లేదుగదండీ కొంపదీసి!" అంది.

నేను మొగమాటాని కలా చెప్పలేదని, పత్రికా ప్రపంచంలో ప్రచురింపబడే చాల కథలకంటె ఇదేం తీసిపోదని, ప్రథమ ప్రయత్నంలోనే అరుణాదేవిగారు ఇలా వ్రాయగలిగారంటే భవిష్యత్తులో రచయిత్రిగా ఎంతో రాణించగలుగుతుందని చెప్పటంలో నాకేం సందేహం లేదని గట్టిగా చెప్పాను.

నా మాటలకు అరుణాదేవి తన ఆనందాన్ని సిగ్గు దొంతరలమధ్య దాచుకుంటూంది.

భార్యను గురించి నా ప్రశంసలు విన్న పరిపూర్ణరావులో ఆనందము, తృప్తికంటె ఓ విధమైన చిన్న గర్వరేఖ తాండవించిందని నే ననుకున్నాను.

రోజులు గడిచిపోతున్నవి. పరిపూర్ణరావు, నేను కలిసేది కాఫీ టేబుల్‌ముందు, అప్పుడప్పుడు సాయంకాలాలు మాత్రమే! అతడికి బోలెడన్ని వ్యాపకాలు. రాత్రి ఏ తొమ్మిదింటికో గాని ఇంటికి రాడు. నా కథ రచన కూడ ప్రారంభింపబడి పెళ్ళి నడక నడుస్తూంది. అరుణకు నాకు మాత్రం సాన్నిహిత్యం రోజు రోజుకూ ఎక్కువవుతూంది. రోజూ రెండు మూడు గంటలు ఆమె మేడపైనే గడిపేది. మా సంభాషణ ఎక్కువగా సాహిత్యపరంగానే కొనసాగేది. ఆమె వెలువరించే సందేహాలు, ఆమె సాహిత్య ప్రియత్వానికి తృష్ణకు నిదర్శనాలుగా ఉండేవి. ఏ అరమరికా లేకుండా ఎన్నో రోజులనుంచి సన్నిహితుడైనవాడితోలా ఆమె ప్రవర్తిస్తూంటే నా కప్పుడప్పుడు అమిత ఆశ్చర్యం జనిస్తూ ఉండేది. పైగా పరిపూర్ణరావు కూడ ఆమె సాహిత్య కృషిని గురించి అడపా దడపా నన్నే ప్రశ్నించేవాడు!

శిఖరాగ్రాన్నెక్కి నడయాడే మానవుడు జారి పడిపోకుండా పదిలంగాను, ఎంతో జాగ్రత్తగాను మసలుకోవాలి. ఏ మాత్రం పొరబాటుగాని, ఏమరుపాటుగాని సంభవించి ఆ శిఖరంనుంచి జారటమంటూ సంభవించిందా.... ఊహూ......ఇహ అంతే! మరేం ప్రయోజనములేదు. కాలు జారినవాడు మరెంత నిలద్రొక్కుకోవాలని ప్రయత్నించినా, పడిపోకుండా తప్పుకోవాలని ఎంత ప్రాకులాడినా అగాధంలోకి వెర్రిపుచ్చకాయలాగ దొర్లిపోక తప్పదు. నైతికమైన విషయాల్లో ఈ ఉదాహరణ పూర్తిగా అతుకుతుం దనుకుంటాను నేను. చీడపురుగు పడటమంటూ సంభవిస్తే పంటంతా నాశనమయినంతవరకు వదలదు. ఏ దుర్ముహూర్తాన ఈ ఇంటిలో అడుగు పెట్టానో.....అరుణాదేవిని ఏ క్షణాన చూచానో—ఆ క్షణంనుంచి నాలో చీడ పురుగులాంటి దుష్ట వాంఛ ప్రవేశించింది. నా తెలివితేటలు, విజ్ఞానము, యుక్తాయుక్త విచక్షణ జ్ఞానము—అన్నీ ప్రతి దినమూ వమ్మయిపోతున్నవి.

పరిపూర్ణరావుది పసివాని హృదయం లాంటిది.

నా హృదయంలో బుసలుకొట్టే త్రాచులాంటి కోరిక పెరుగుతూంది.

అరుణాదేవి నాతో మరీ అంత చనువుగా ఉండటం?

పై ప్రశ్నను గురించి ఒక్కసారి గాదు, ఎన్ని వందలసార్లో ఆలోచించాను. దానికి జవాబుగా ఒక కోణంలో ఎన్నో ఆశలు, ఎంతో మధురానుభూతి, గాలిలో తేలిపోగలిగేంతటి ఒక అనిర్వచనీయమైన "రిలీఫ్" లాంటిది లభ్యమయ్యేది.

దానికే జవాబుగా మరో కోణంలో నామీద నాకే అసహ్యము, జుగుప్స కలిగి, నా అంతటి నీచుడు, సంస్కార విహీనుడు మరి ఉండడేమో నన్నంత సిగ్గు నన్ను క్రుంగదీసేది.

> *విజయంలోనుంచి ద్వేషం ఉద్భవిస్తుంది. ఓడినవాడు దుఃఖితుడు కావడమే దానికి కారణం. జయాపజయాలను విసర్జించినవాడు సంతృప్త మానసుడు; ఆనందమయుడు.*

హృదయంలో ఈ నిత్యాగ్ని హోత్రమేమిటి?

భగవాన్! ఎటన్నా పారిపోతే.....!

లేక ఈ గుప్పెడు ప్రాణాల్ని.........దీనికి ప్రాయశ్చిత్త మేమిటి?

## 5

"నేను తిరిగి వారం రోజుల్లో వస్తాను" అన్నాడు పరిపూర్ణరావు. సినిమా పనిమీద బొంబాయికి వెళ్ళుతూ చెప్పిన మాటలవి.

అరుణాదేవి, నేను సెంట్రల్ స్టేషన్ కెళ్ళి బొంబాయి ఎక్స్‌ప్రెస్ కదిలినంతవరకు ఉండి పరిపూర్ణరావును సాగనంపాము. అరుణ ఏవేవో పుస్తకాలు కొంటూంది. నా మనసు కింకర్తవ్యతా విమూఢమై ఉంది. "టైమ్ అనౌన్సర్" కీచు గొంతుక దూర తీరాల్లోంచి వినిపించినట్లుంది.

"వెళ్దాం పదండి!"

ఆమె కళ్ళలోకి సూటిగా చూచాను. ఆమె చిన్నగా నవ్వినట్లు ఉంది. ఆమె వెనుకే తల వంచుకొని "కారు స్టాపింగ్" వద్దకు మొద్దబ్బాయిలా నడుస్తున్నాను.

వెనుకనుంచి "భుయ్", "భుయ్" కారు హారన్ వినిపించింది. నాలు గడుగులు ప్రక్కకు వేశాను. వెనుదిరిగి చూడనైనా లేదు. తిరిగి వీపు మీదనే హారన్ మ్రోగినట్లయింది. వెనుతిరిగి చూడాలని తల ప్రక్కకు త్రిప్పబోతున్నాను. అంతలోనే......ఒక పెద్ద బండరాయి నా వీపుకే గురిపెట్టి ఎవరో విసిరినట్లయింది. పెద్దగా కేక బెడుతూ కుప్పగా కూలిపోయాను...అంతే... తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.

కళ్ళు తెరచేసరికల్లా ప్రతి రోజూ కనుపించే బోసినోటి గాంధీతాత పటం నా కళ్ళ కెదురుగుండా కనుపించింది. నేను మేడమీద, నా గదిలో, నా మంచంలోనే ఉన్నా నన్నమాట! అయితే సెంట్రల్ స్టేషన్.....కారు హారన్.... బండరాయి.....ఇవన్నీ పీడకలలు కావుకదా? కాదన్నట్లు విపరీతమైన శిరోవేదన, కుడి మోకాల్లో ఎముకల నలియే సాక్ష్యమిస్తున్నాయి. వెల్లకిల పడుకున్నవాడి నల్లా ప్రక్కకు తిరగాలని ప్రయత్నించినాను. కాని, నా అవయవాలు నా స్వాధీనంలో ఉన్నట్లు లేవు. కండరాల కదలికవల్ల ఒళ్ళంతా విపరీతమైన పోట్లు ప్రారంభమయినవి. "అబ్బా!" అంటూ

ఘోరంగా మూలిగాను.

"ఏమండీ!" అది అరుణాదేవి కంఠస్వరమే.

అరుణ ఆత్రంగా మంచంమీదికివంగి నావైపే చూస్తూంది. ఆమె విశాల నయనాల్లో కన్నీరు మిలమిల మెరుస్తూ రాలిపడబోతూన్న ముత్యాలరూపంలోకి రూపుదాలుస్తున్నాయి. ఆమె ప్రక్కనే డాక్టర్, వృద్ధనౌకరు నిలుచుని నావంకే చూస్తున్నారు.

"కొద్దిగా కాఫీ ఇవ్వండి. పది నిమిషాల్లో స్పృహవస్తుందని నేను చెబుతున్నా మీరనవసరంగా గాభరాపడ్డారు" అంటున్నాడు డాక్టర్.

నౌకరుతాత సున్నితంగా నావీపుక్రింద తన చేయివేసి నన్నులేపాడు. ఎత్తైన తలగడనానుకొని వృద్ధుని ఆసరాతో కూర్చుంటూ బాధగా మూలిగి "డాక్టర్" అన్నాను నేను.

డాక్టర్ చిరునవ్వుచిందించి "ఏమీ భయపడవలసిన అవసరంలేదు. తలకు చిన్నదెబ్బ తగిలింది. మోకాలు గీసుకుపోయింది. అదృష్టవంతుడివి. ఆ కారు వేగంగాపోతూంటేను, లేక డ్రైవర్ పనివాడు కాకపోతేను ఏమయ్యేది? ఎంత పరధ్యానం మనుషులు మీరు. హూ...." అన్నాడు.

"డాక్టర్!" అరుణాదేవి గొంతుకలోని కోపంజీర ఖంగుమంది. ఏమో అనబోతున్న డాక్టర్ స్తబ్ధుడైపోయి ఆమెవంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంద!" ఆమె సున్నితమైన హస్తస్పర్శ నా భుజాలమీద పడి సర్వావయవాల్లోకి విద్యుత్తరంగాలు ప్రాకినట్లు ఒళ్లంతా పులకరించింది. అంతబాధ, ఆక్షణంలో ఆ అమృత హస్తస్పర్శ ప్రభావానికి అదృశ్యమైనట్లని

# దేవత

పించింది. నా పెదాలకు ఆమె గ్లాసుఅందిస్తూంటే నాకళ్లు ఆమె వైపు జాలిగాను, కృతజ్ఞతగాను చూశాయి.

ఆ చేతులతోటి విషమైతేనేం? మధురంగా ఉంటుందనిపించింది.

"రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారు." మృదుమధురస్వరం నాచెవులకెంత తియ్యగా వినిపించిందో చెప్పటానికి నాకు మాటలు చాలవు.

" హూ... ఇక చాలండీ!..."రెండు గుటకలు మ్రింగి అన్నాను. ఆ కాఫీ నానోటికెంతో వెగటుగాను, చేదు విషంగాను ఉంది.

"అయ్యో! త్రాగనేలేదండీ! కొద్దిగానైనా తీసుకోరూ!?" ఆమె కళ్లలో దయాసౌహార్దాలతోపాటు బాధకూడ కనుపించింది.

"అబ్బ! క్షమి..."

"నాకోసమైనా తీసుకోరూ?"

ఆమె దీనస్వరం నన్ను విభ్రాంతుణ్ణి చేసింది. ఆమెకోసం!

ఆమెకోసం!

కళ్ళుమూసుకొని గుటగుటా త్రాగేశాను. అది సయించిందో లేదో నాకవసరంలేదు. ఆమెకోసం నేనేమైనా త్రాగుతాను! ఏమైనా అయిపోతాను! అంతే!

రెండు రోజులు గడిచినవి. డాక్టర్ చెప్పింది నిజమే! నాకేమీ పెద్ద దెబ్బ తగులలేదు. నొసట ఒక చిన్న గాయమూ, మడ్‌గార్డ్ రాచుకోవటంవల్ల ఎడమకాలు జీరకపోవటం — అంతే జరిగింది.

ఎక్కడో యోచనలతో ఉన్నందువల్ల, హఠాత్ ప్రమాదంవల్ల కలిగిన భయకారణంగా స్పృహ తప్పింది. ఆతర్వాత జ్వరంకూడ బాగానే వచ్చింది. డాక్టర్ రోజూ నాలుగైదు సార్లు వచ్చిపోతున్నాడు. అరుణాదేవి ఇరవైనాలుగు గంటలూ నాసేవలోనే గడుపుతూంది. బాహ్యంగా నేను పడుతున్న బాధే ఆమెకు తెలుసు. నా అంతరంగంలోని వ్యథ ఏలా వెలువరించను?

"మీకెందుకీ శ్రమ? నన్ను హాస్పిటల్లో చేర్పించండి!" అన్నాను.

ఆమె నావైపు అదోమాదిరి చూచి వెంటనే నవ్వింది. జవాబిచ్చింది గాదు. సిగ్గుపడ్డ నేను కూడ తర్వాత మరేం మాట్లాడలేదు.

మరోరెండుదినాలు గడిచినవి. నూటనాలుగు డిగ్రీలకు పైగా చూపుతున్న థర్మామీటర్ నార్మల్‌కు దగ్గరదగ్గరగా వచ్చేస్తోంది. డాక్టర్ గారి మందులకంటె అరుణాదేవి గారి పరిచర్యలే నన్ను స్వస్థుడుగా చేస్తున్నవి. ఆమె చేసే ఊరడింపు, మాట్లాడే సానునయ వాక్యాలు నాలో ఆశను రగిలించాయి. నాకోసం ఆమె పడుతున్నబాధ నాబాధను హరింపజేస్తూంది. మరి రెండు రోజులు— మరింత ఆరోగ్యాన్ని పుంజుకున్నాను.

అర్ధరాత్రి. హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. తెరిచినకిటికీల్లోంచి చల్లగాలి మెల్లగావీస్తూంది. బ్లూలైట్ చిరుకాంతికి గదంతా అదో అందంగా ఉన్నట్టుంది. నా మంచానికయిదారు గజాల దూరంలో "కాంప్‌కాట్" మీద పడుకొని నిశ్చలంగా నిద్రబోతూంది అరుణాదేవి. నేను లేచి మంచం మీదనే కూర్చుని కన్నార్పకుండా ఆమెవైపు చూస్తున్నాను. నిద్రలో కూడ ఆ వదనం మీద నడయాడే చిరు దరహాసం ఆమెను వదిలింది కాదు. రెండు మంచాలమధ్య నుండే 'టేబుల్ ఫాన్' వీచేగాలి కప్పుడప్పుడు ఆమె ముంగురులు నాట్యమాడుతున్నట్టు మెల్లగా కదులాడుతూ ఉన్నవి. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఆ ప్రశాంత నిశీథసమయంలో స్పష్టంగా వినిపిస్తున్నవి. ఆమె తలలోని మల్లెలు విచ్చి వాసనలు గుబాళిస్తున్నవి.

నాలో నడయాడుతూన్న దుష్టపుటూహాలు ఉవ్వెత్తుగా విజృంభించినవి.

నా సంస్కారం, నేను నమ్మే నైతిక సూత్రాలు పెనుతుఫానుకు దూది పింజల్లా పారిపోయినవి.

నేను నేను గాదు!

నాలో ఏదో ఆవేశించింది.

గట్టిగా నిట్టూర్పు విడిచాను.

ఆమెలో చలనమే లేదు.

మెల్లగా మంచందిగి పిల్లి అడుగులువేస్తూ మెట్లుదిగాను. క్రిందిహాల్లో తలుపునానుకొని గుర్రుపెట్టుతూ నిద్రబోతున్నాడు నౌకరు తాత.

గాఢనిద్రలోఉన్న ఆ తాతవైపు కృతజ్ఞతగా చూచి తిరిగి పైకి చేరుకున్నాను.

ఇన్ని రోజుల లగాయతూ నాలో జరుగుతున్న

పంచ మహల్
(ఫతేపూర్ సిక్రి) ఫోటో— వై. మధుర మోహనబాబు (బంకూరా)



సంఘర్షణ ఆగిపోయింది.

ఆమెకూడ నన్ను ప్రేమిస్తూంది. కాకుంటే అంత చనువు తీసుకోవటము, అంత ఆదరంగా పరిచర్యలు సాగించటము, 'నాకోసం తీసుకోరూ?' అంటూ సూటిగా కళ్లలోకి చూడటం ఎందుకూ? నాలో నేను ప్రశ్నించుకున్నాను. 'ప్రేమిస్తూంది' అనేకంటే—నేనామెను కామిస్తున్నట్లు ఆమెకూడానేమో! – అనుకుంటే....నాలో నేనే తర్కించుకున్నాను. అవును! ప్రేమ ఎక్కడుంది? కామమే! కామం..వాంఛ.నరనరాల్నితోడేసే విరహానికి విరుగుడు స్త్రీసుఖం — ఏ ఒకరికో సర్వస్వం అర్పించేటంతటి త్యాగం మనలో జ్వలింపజేసేదెందుకో! ఏమో, నాకు తెలియదు. వచ్చిన సందేహాలన్నింటినీ ప్రక్కకు నెట్టేశాను. మెల్లగా ఆమె మంచం సమీపించాను.

నా నరాల్లో లావా ప్రవహిస్తూంది.

నా కళ్లు నిప్పులు గురిపిస్తున్నవి.

నా హృదయంలో కుంపటి రగులుతూంది.

నాగుండె వేగంగా కొట్టుకుంటూంది.

బలిష్ఠమైన నా రెండు చేతులు ఆమె గుండ్రటి భుజాల్ని గట్టిగా అదిమి పట్టుకున్నవి.

దూరంగా ఎక్కడో ఒక తీతువుపిట్ట అసహ్యంగా కూసింది.

నేను ఆమె మంచం మీదికి.. ఆమె మీదికి ఒరిగిపోతున్నాను!

"అన్నయ్యా!"

ఉలిక్కిపడిపోయాను.

ఆమె కళ్లలో కోపం లేదుగాని భీతి తళుక్కుమంది. ఆమె కంఠస్వరంలో దీనత ధ్వనించలేదుగాని ఆజ్ఞాపన గర్జించింది.

ఆమె దేహం కంపించలేదుగాని నిశ్చలంగానే ఉంది!

'అన్నయ్యా!' అన్నది కేకాగాదు. పిలుపూ గాదు. నిశ్చలంగా ఆమె నావైపు చూచిన చూపుకు తల్లడిల్లిపోయాను. నా రెండు చేతులు వాటంతటవే విడివడినాయి. ఆ క్షణంలో నా కాళ్లక్రింది భూమి ఎందుకు క్రుంగిపోదు? నాతల వేయివ్రక్కలైపోకుండా ఎందుకుంది ఇంకా?

వెర్రెత్తిన వాడిలా గబగబా నడచాను. దబదబా మేడమెట్లు దిగుతున్నాను.

"అన్నయ్యా!"

ఆమె తిరిగి సంబోధించింది. ఆమె పిలుపును లెక్కచేయకూడదనుకున్న నాకాళ్ళు నాకే సహాయ నిరాకరణ చేశాయి!

ఆమె నాదగ్గరగా వచ్చి నిలబడింది.

నావైపు సూటిగా చూచింది.

నేను తలవంచుకున్నాను.

"అన్నయ్యా! జబ్బు మనిషివి. అర్ధరాత్రి ప్రయాణమెక్కడ?" ఒక్కొక్క పదాన్ని ఒత్తి పలుకుతూ తీవ్రంగా ప్రశ్నించింది.

నేను జవాబియ్యగల పరిస్థితిలో లేను.

మౌనంగా అలానే నిలబడ్డాను.



శృంగారం
(శిల్పం)

ఫోటో—కె. సీతారామన్ (తిరుప్పూరు)

"అన్నయ్యా! ముందు కడుగువేస్తే నీ చెల్లి ఇక్కడే తల పగులగొట్టుకొని చస్తుంది." నిశ్చలత్వం గాంభీర్యం ఆమె కంఠంలో ఖంగుమన్నవి.

"చెల్లీ..." గట్టిగా కేకబెట్టాను. నాకళ్ల నుండి ధారాప్రవాహంగా అశ్రువులు జాలువారాయి.

మెట్లమీద బోర్లగిల పడ్డ నన్ను ఆమె రెండు చేతులతోను లేవనెత్తి చిన్న పిల్లాడిలా లోనికి నడిపించుకొని వెళ్లింది. ★